# రాగం-తానం-పల్లవి


—కప్పగంతుల మల్లికార్జునరావు



**కామాక్షి:**

పెళ్ళిచూపుల్లో నేను మరీ ఎక్కువగా సిగ్గు నటిస్తానని మా అమ్మ నన్నెప్పుడూ సాధిస్తుంటుంది. కన్నతల్లి అయితే అలా సూటిపోటి మాట లనదేమో! సవతి తల్లి కనుక నా సిగ్గును గురించి ఆమె చేసే సాధింపు అంతా యింతా కాదు.

నిజం చెప్పొద్దూ - నాకు సిగ్గు కాస్త ఎక్కువే. అయితే అది అందరు పురుషుల దగ్గరా కాదు. ఆ మాటకొస్తే చిన్నప్పటి నుంచీ నేను ఎక్కువగా ఆడుకొన్నది మగపిల్లలతోనే. పెద్దయ్యాక కూడా చాలామంది మగవాళ్ళు నా వెంట పడ్డారు అల్లరి చిల్లర వేషాలు వేస్తూ. అప్పుడు నాకు సిగ్గువేయలేదు. అలా నా వెంటపడ్డ మగాళ్ళను నేనే నానా అల్లరిపెట్టే దాన్ని. మా వూళ్లో నాకుపొగరు మోతు అన్న పేరు కూడా వచ్చింది.



కాని నాకు మొగుడు కావటానికి వచ్చిన పురుషు డంటే చచ్చే సిగ్గు. వాడు నా మొగుడైనట్టే నా వొళ్ళు పులకరించి పోతుంది. సిగ్గుతో రెప్పలు అరమూతలు పడ్తాయి. కళ్ళు బరువెక్కి పోతాయి. ఇక మగాడి మొహంలోకి చూడటం నా తరంకాదు.

యిలా చాలాసార్లు జరిగింది. నన్ను చూడటానికి ఎంతో మంది పెళ్ళి కొడుకులు వచ్చారు. కాని వాళ్ళల్లో నేను చాలా మందిని చూడనే లేదు. "యింత తగని సిగ్గుగల పిల్ల రేపు మా వాడితో ఏం కాపురం చేస్తుంది?" అని కూడా కొందరని పోయారు.

ఏమైనా నా సిగ్గు నాకో పెద్ద సమస్య అయినట్టే, నా పెళ్ళి మా నాన్నకు పెద్ద సమస్య అయింది. మా నాన్న వొట్టి పిసినారి. అమ్మ బతి కున్న రోజుల్లో తిండిక్కూడా మొహం వాచిపోయేలా బాధలు పెట్టేదని చెప్పుకొంటారు. కాని సవతితల్లి ఆయన తిక్క కుదిర్చింది. ఆమెకు దాచి పెట్తాడు. కాని నాకని పైసా ఖర్చు పెట్టటం సవతి తల్లికి యిష్టంలేదు. మా నాన్నకు ప్రాణం వొప్పదు. ఆస్తి వుందని పేరేగాని మా నాన్న ఎప్పుడూ నిష్ట దరిద్రుడిలా వుంటాడు. మా సవతి తల్లి మాత్రం రంగేళీ పోకిళ్ళు పోతుంటుంది.

నా పెళ్ళి కాకపోవటానిక్కారణం నా సిగ్గు అని సవతి తల్లి ఆడిపోస్తే, నా రంగే అందుకు ముఖ్య కారణం, అని మా నాన్న అస్త మానం విసుక్కొంటుంటాడు. నేను నల్ల పిల్లనన్నమాట వాస్తవమే. కాని నేను చాలా అందంగా వుంటానని మగాళ్ళేకాదు, యిరుగు పొరుగు అమ్మలక్కలు కూడా అంటుంటారు. డబ్బురాలిస్తే కొండమీది కోతేకాదు కొండకింద బంగారంకూడా చేతుల్లో పడ్తుంది. కాని నాన్నకూ ఆ డబ్బుకూ పెద్ద లంకె. అందుకే నాకు పెళ్లి కాలేదని నా నమ్మకం. నన్ను చూచిన పెళ్లి కొడుకులు నన్ను చేసుకోక పోవటానికి యివన్నీ కారణాలే. కొందరు కారణాలే చెప్పకుండా కాదుపొమ్మన్నారు.

"యీ తడవన్నా కాస్త తలెత్తుకు తగలబడు. యీ పెళ్లి చూపుల తతంగాలతోనే ఇల్లంతా గుల్లయే టట్లుంది-" జడేసి అలంకారాలు చేస్తూ సాధించింది, అమ్మ.

"ఆ మొఖానిక్కాస్త పౌడరు బాగా రాయి. చేతులూ అవీ కన్పించ కుండా పైట కప్పుకో నీ పెళ్లి ప్రయత్నంలోనే నా ప్రాణం కాస్త

గుటుక్కు మనేటట్లుంది."





అమ్మా నాన్నల ఈ ఎత్తి పొడుపులు నాకు కొత్తేం కాదు. అలవాటు పడి పోయాను.

"పెళ్లి కొడుకు పచ్చగా, భారీగా అందంగా వుంటాడు. మొగుడయినా కాకపోయినా కళ్ళారా చూస్తే పాపంరాదు. కాస్త తలెత్తిచూడు."

పెళ్లి కొడుకును నాన్న వర్ణిస్తుంటే నాకు కోటీశ్వర్రావు గుర్తొచ్చాడు.

కోటీశ్వర్రావు నన్ను చూడవచ్చిన పెళ్లికొడుకుల్లో వొకడు. నేను కన్నెత్తి చూచిన పెళ్లి కొడుకుల్లో మొదటి వాడు.

అసలేం జరిగిందంటే, అప్పుడూ నాన్న యిలాగే రాబోయే పెళ్లి కొడుకు పచ్చగా, భారీగా వుంటాడని వర్ణించి చెప్పాడు. విని పొంగి పోయాను. నేను నల్లదాన్నికదూ? అందుకేనేమో నాకు చాలా చిన్నతనం నుంచి పచ్చటి మనిషి మొగుడుకావాలనీ, పచ్చటి కొడుకుల్ని కనాలనీ కోరిక వుండేది. అసలు పచ్చగా దబ్బపండు రంగులో వుండే మగాళ్ళంటే



నాకు యిష్టం, భారీగా వొడ్డూ పొడుగు వున్న వాళ్ళంటే నాకు గౌరవం-అభిమానం. నేను భారీగా వుంటానని ముందే చెప్పాగా.

నాన్న వర్ణన విన్నాక ఎలాగైనా అతడిని చూడాలన్న కోరిక మనసులో బయల్దేరింది. కాని సిగ్గు! దాని దుంపదెగ- నా కెదురుగ్గా కూర్చున్న పురుషుడు నా మొగుడు కావచ్చు నన్న భావనే నన్ను సిగ్గుతో ముంచేసింది. ఆ పురుషుడు అంతసేపూ నన్నే చూస్తున్నాడన్న ఆలోచనే నా మనసును పులకింపచేస్తుంది.

చాలాసేపయ్యాక-యిక పెళ్ళిచూపులతంతు ముగుస్తుందనగా సవతితల్లి వెనక నుంచి చెయ్యి గిల్లి గిల్లి చంపగా ధైర్యం చేసేను. సిగ్గు పీక నొక్కి గుప్పిట్లో పట్టుకొని తలెత్తి అతని వైపు చూచాను.

అబ్బ! అప్పటి నా స్థితినెలా చెప్పను? ఆ సమయంలో అతను నా వైపు చూస్తుండ దనుకున్నాను. కాని ఆ కోటీశ్వర్రావు నా వైపే చూస్తున్నాడు. ఎలా చూస్తున్నాడని? వొళ్ళంతా కళ్ళు చేసుకుని చూస్తున్నాడు. అతని కళ్ళల్లో ఎన్ని కోరికలు? ఎంత ప్రేమ? ఎన్ని భావాలు? ఎన్ని పాటలు? మా రెండు రెళ్ళు నాలుగుకళ్ళు కలుసుకొన్న సమయంలో నాకు ప్రేమంటే ఏమిటో తెల్సిపోయింది. అయినా అతనెంత అందంగా వున్నాడని? పురుషుడంటే అతనే పురుష డనిపించేలా వున్నాడు. నేను ఎంత మంది పురుషుల్ని చూడలేదు. కాని యీ కోటీశ్వర్రావును చూచిన క్షణంలో పొందిన అనుభూతిని ఎన్నడూ పొందలేదు. అతను వెళ్తుంటే కిటికీ చువ్వల్లో నుంచి మళ్లీ మళ్లీ చూచాను. అతను మొగుడయినట్లే అనుకొని పొంగిపోయాను. నా అదృష్టాన్ని వూహించుకొని మురిసిపోయాను.

కాని నా మురిపాన్ని, ఆశల్ని అతను-ఆ కోటీశ్వర్రావు పీకపిసికి చంపేశాడు. నల్లపిల్ల నన్న నెపంతో నన్ను కాదనేశాట్ట. అలాంటప్పుడు పెళ్లి చూపుల్లో మింగేసేలా అలా చూడటం దేనికి? అతగాడు ఆ క్షణంలో నాకళ్లముందుంటేనా ఆ చెంపా ఈచెంపా వాయిద్దా మన్నంత కోపం వచ్చింది. కాని కన్నీళ్ళు కట్టలు గట్టి ప్రవహించేలా కుమిలి కుమిలి ఏడ్చేశాను. ఆ తర్వాత వొకరిద్దర్ని యిలా ధైర్యంచేసి చూచాను కాని కోటీశ్వరరావు ముందు అందరూ దిగదుడుపే.

"పదపద! యిక్కడే సిగ్గుపడ్తూ కూర్చుంటే కుదరదు. పెళ్ళి

వాళ్ళు నీ అందాన్ని చూట్టానికి కనిపెట్టుకొని వున్నారు."

వెళ్లి మామూలుగానే కూర్చున్నాను. తల ఎంత పైకెత్తుదామన్నా కిందికి దిగిపోతూనే వుంది. కాని నాన్న ఆ పెళ్ళికొడుకును గూర్చి చేసిన వర్ణనలు గుర్తుకొచ్చినప్పుడల్లా అతన్ని చూడాలన్న కోరిక గుండెల్లో తంతోంది. కొంపతీసి ఆ కోటీశ్వర్రావులా యీ కిష్టయ్యా నావైపు చూస్తుంటే? — శరీరం 'ఝల్లు' మని జలదరించింది.

కాబోయే మామగారు పెద్దగా మాట్లాడలేదు. నేను నచ్చినట్లే వుంది. ముహూర్తా లంటున్నాడు. పెళ్ళిచూపుల తంతు అతి తక్కువ కాలంలో ముగుస్తోంది. పైగా అతను నా భర్త అయ్యేటట్లే వున్నాడు. యింకా సిగ్గుపడ్తూ కూర్చుంటే కాబోయే భర్తను ముందుగా చూచుకోగలనా?

తెగించి అతనివైపు చూచాను.

కానీ, మనిషి ఎంత బాగున్నాడు? కోటీశ్వర్రావును తలదన్నే పసిమిరంగు, అతడి తల గొట్టేటంతటి వొడ్డు, పొడుగు, నొక్కుల జుట్టు. యింతటి అందగాడిని యింత సులభంగా భర్తగా పొందటానికి నేనెంత అదృష్టం చేసుకొని వుండాలి?

అతను నావైపు ఒక్కసారి చూడకూడదూ! కోటీశ్వర్రావులా కళ్లతో మాట్లాడకూడదూ? వొక్కసారి....వొక్కసారి....

ఎన్నడూ రాని ఆ కోరిక తీరకముందే పెళ్ళి చూపులు ముగిసేయి.

ముహూర్తాలు ఆరోజే కుదుర్చుకున్నారు. ఎలాగైతేనేం నా పెళ్ళి నిర్ణయమయింది. నేనూ ఒక మొగవాడికి భార్యను కాబోతున్నాను. దబ్బపండులాంటి బిడ్డకు తల్లినైనట్లు పులకించి పోయాను. నా స్త్రీత్వం ధన్యమైనట్లే మురిసిపోయాను.

## సూరయ్య:

అడ్డమైన గడ్డీ కరచి. రాత్రింబవళ్లు యితరుల నేలను నాదనుకొని కష్టపడి నన్ను కట్టుకుపోయినంత ఆస్తినయితే సంపాదించాను కాని, కిష్టిగాడికి వొక్క ఆడపిల్లను పెళ్ళాంగా తీసుకురావటానికే నానా యాతనలూ పడాల్సి వచ్చింది.

అదేం కర్మో కాని-కిష్టిగాడికి చిన్నప్పటి నుంచి ఆడ పిల్లలగాలే గిట్టేది కాదు, వాళ్ళు అలా వస్తుంటే వీడు భయంతో ఇలా పారిపోయేవాడు, అయితే పొలంలో వాడి యీడు మగాళ్ళకన్నా వో పిసరు ఎక్కువే

పనిచేసేవాడు. మగ కూలీలను దబాయించి పని చేయించటంలో వాడికి వాడే సాటి. అదే ఆడకూలీ ఎవరైనా వొక్క మాటంటే భయంతో కుంచించుకుపోయేవాడు.

వయసొచ్చే సరికి అందరికిలాగానే వాడికీ గడ్డాలూ మీసాలూ వచ్చాయి. కాని ఎంత వయసొచ్చినా ఆడదంటే భయమో అసహ్యమో అది మాత్రం పోలేదు.

"ఏరా? నీకు వయసొచ్చింది. పెళ్లి చేస్తాను" అన్నరోజు సిగ్గుతో వాడెలా మెలికలు తిరిగి పోయాడో తల్చుకుంటే నాకే యిప్పటికీ అసహ్య మేస్తుంది. ఆడదికూడా అంత సిగ్గుపడదు. అలాగని వాడికి పెళ్లి చేయకుండా వుండగలనా?

ఇద్దరు కొడుకుల్లో పెద్దాడు చిన్నప్పటి నుంచి గ్రంథసాంగుడే. ఆడపిల్లల్తో తప్ప. చిన్నప్పటి నుంచి తిరిగేవాడు కాదు. వయసొచ్చాక ఎవరో మాలపిల్లను తీసుకుని లేచిపోయాడు. నాలుగామడల దూరంలో ఆ పిల్ల బంధువుల వూళ్ళో మాలపల్లిలో కాపురం పెట్టేడు ఆ మాదర్చోదు వెధవ! నన్ను అలా దగాచేసి పోయిన వెధవ నాకొడుకే కాదను కొని తర్పణం విడిచి వూరుకొన్నాను. నేను ఏది పోయినా సహించగలను గాని నాకులం, గౌరవం, సాటివాళ్ళల్లో పోతేమాత్రం భరించను. భ్రష్టుడై పోయిన వెధవ నాకు కొడుకెలా గౌతాడు?

వాడలా ఎందుకూ కొరగాకుండాపోగా యిక నాకు మిగిలింది కిష్టిగాడు. వాడు పుట్టాకనే నా భార్య చనిపోయింది. అప్పటి నుంచి తల్లి లేని వెధవను ఎంత గారాబంగా పెంచానో నాకు తెల్సు. ఎన్నికష్టాలు పడ్డానో! అందుకే కాబోలు వాడంటే నాకు అపరిమితమైన ప్రేమ. కాస్త లోపంవున్నంతమాత్రాన వాడలా పెళ్ళి పెటాకుల్లేకుండా మానులా వుండి పోవటమేనా? మనమడిని ఎత్తుకోవాలన్న నా కోరిక నీళ్ళు కారి పోవల్సిందేనా?

వీల్లేదు. కిష్టిగాడికి పెళ్ళిచేసి తీరాలి. వాడికి పిల్లలు పుట్టాలి. ఆస్తికి, నా కష్టానికి వారసులు కావాలి, నన్ను "తాతా" అని పిలవాలి. నా భుజాల మీదకెక్కి ఆడుకోవాలి!

"సీ పిచ్చిగాని సూరయ్యా. వాడికి పెళ్ళి చెయ్యాలని ఎందుకయ్యా అలా తాపత్రయ పడ్తావు? నీకేం మనవళ్ళు లేరని భయమా? వారసులు

లేరని దిగులా? లక్షణంగా పెద్ద కొడుకుని, పిల్లల్ని తెచ్చిపెట్టు కోరాదూ యింట్లో?"




వెధవ సలహాలు! పెద్దవాడికి నలుగురు పిల్లలన్నమాట వాస్తవమే. కానీ ఆ మాలదానికి పుట్టిన పిల్లలు నాకు మనవళ్ళవుతారా? ఈ మాలపిల్ల మనుష్యులు నా యింటికి వారసులు కావటమా? చచ్చినా అలా జరగదు. యిలాంటి వెధవ సలహాలిచ్చి నన్ను వర్ణసంకరుడిని చేసి, కులం పోయిందని నా వెనుక నన్ను వెక్కిరిద్దామని వూళ్లోవాళ్ళ తాపత్రయం, కుట్ర! నేనేనా అంత తెలివిలేని వాడిని, చాతకాని వాడిని! ఊళ్ళో వాళ్ళ సలహాలు వినేకొద్దీ నాకు కిష్టిగాడికి పెళ్ళి చేయాలన్న పట్టుదల హెచ్చింది. మొదటి నుంచి నా స్వభావం అంతే. అందరూ కాదన్నదాన్ని చేయాలన్న పట్టుదల జాస్తి. అలాచేస్తే నాకు గొప్ప ఆనందం- తృప్తి కలుగుతుంది!

ఎందుకైనా మంచిదని పట్నం తీసుకెళ్లి వో పెద్ద డాక్టర్‌కి చూపించాను వాడిని, ఏ లోపం లేదని రాసిచ్చాడు, అదోరకమైన మానసిక వ్యాధట.

---

## కళ్ళజోడు

చత్వారం వున్న ఒకవ్యక్తి ఒక షాపులో ఒక కళ్ళజోడు కొన్నాడు. 'దానివెల ఇరవై రూపాయలు' అన్నాడు కొట్టు యజమాని. అది తీసుకుని ఆ వ్యక్తి పది రూపాయలనోటు యిచ్చి పోబోయాడు.

"మీరిచ్చింది పదిరూపాయలే, ఇంకోపదియిచ్చి వెళ్ళండి" అన్నాడు కొట్టు యజమాని.

"ఒకటేమిటి, అవి పదిరూపాయల కాగితాలు రెండు, మీకు అనుమాన మయితే మీరిచ్చిన యీ కళ్ళజోడుపెట్టుకు చూడండి!" అన్నాడు చత్వారం వ్యక్తి.

'ఫోబియా' అనో ఏదో చెప్పేడు ఇంగ్లీషులో. పెళ్ళయితే పోవచ్చునట కూడా. ఆడ వాళ్ళతో కల్సి తిరిగే పరిస్థితులు ఎక్కువగా కల్పించమన్నాడు.

కిష్టిగాడికి వూళ్లో వాళ్ళెవరూ చూస్తూ చూస్తూ పిల్లనివ్వరని నాకు తెల్సు. అందుకని జిల్లా మొత్తాన్ని వదిలేసి పై జిల్లాల్లో సంబంధాలు చూచాను. ఒకటి రెండు సంబంధాలు చూచాను కాని వాళ్ళు వాడిని చూడగానే పసికట్టేరు.

వెధవకు ఎంత నూరిపోసినా పిల్లవైపు చూడడు. కూర్చున్న ఆ అయిదు నిమిషాలు ముళ్ళమీదనో నిప్పుల మీదనో కూర్చున్నట్లు కూర్చుంటాడు.

అదృష్టం! అంజయ్యగారి సంబంధం తగిలింది. వాడికి కల్యాణ ఘడియ వచ్చింది. పిల్ల నల్లదయితేనేం గాక? కామాక్షి ఎంత అందంగా వుంది! మంచిదిగా 'బుద్ధిమంతురాలుగా' కన్పించింది! సవతి తల్లి చేతుల్లో పెరిగిన పిల్ల. అణకువ నేర్చుకొనే వుంటుంది. కోడలయ్యాక అదే భర్తను దిద్దుకొంటుందన్న నమ్మకం కలిగింది. బిడ్డల్ని కని నా కోరిక తీర్చగల శక్తిమంతురాలు కామాక్షే నన్న ఆశ ధృఢమయింది!

## కామాక్షి:

మెళ్లో మూడు ముళ్ళు పడగానే బరువు దించుకొన్న వాడిలా హాయిగా నిట్టూర్చాడు నాన్న. అంతపిసినారి మనిషిని నేనెక్కడా చూడను! అల్లుడికి యిస్తానన్న కట్నంలో సగమే యిచ్చాడు. జరిపిస్తానని అంగీకరించిన మర్యాదల్లో పాతిక వంతుకూడా జరుపలేదు. అయినా మా మామగారు కాని, భర్తగాని పన్నెత్తి వొక్కమాట అనలేదంటే వాళ్ళెంత మంచివాళ్లో!

కాని నేను పెళ్ళికి ముందు కట్టుకున్న కోరికల మేడల్లో వొక్కటీ నేలమీద నిలవలేదు. పెళ్ళిపీటలమీదనన్నా అతను నా కళ్ళల్లోకి చూస్తాడను కొన్నాను. పక్కన కూర్చున్నప్పుడు ఎవరూ చూడకుండా, బుగ్గ కాకపోయినా కనీసం చెయ్యన్నా చిలిపిగా గిల్లక పూరుకోడను కొన్నాను. తెరపట్టినప్పుడు తెర పైనుంచి నా కళ్ళల్లోకి తొంగిచూచి నా అందాన్ని వుసిగొల్పుతూ కన్ను గీటుతాడను కొన్నాను. తలం బ్రాలప్పుడు పోటీపడి పళ్ళెం ఎత్తి కుమ్మరిస్తాడని సంబర పడ్డాను. యిలాంటి





దృశ్యాలు నేను ఎన్ని పెళ్ళిళ్ళలో చూడలేదు కనుక?

అయితే యిలాంటి సర్దాలేమీ లేకుండానే నా మెళ్లో మూడు ముళ్ళుపడ్డాయి. నేనే యీ సర్దాలు తీర్చుకుందా మంటే యీ వెధవ సిగ్గొకటి - చచ్చిన సిగ్గు, అదేం చిత్రమో నా కోరికలకు, నా సిగ్గుకు ఎప్పుడూ పొత్తు కుదరదుకదా? అయినా అదేమిటో నాకెప్పుడూ మగాడు నన్నేదో చేయాలన్న కోరికే తప్ప నే నేమీ చేయలేని శక్తిహీనురాలినయి పోతుంటాను?

అప్పటికీ చచ్చే శక్తినంతా కూడ తీసుకుని, సిగ్గును కొద్దిగా చంపేసి, మూడుముళ్ళు మెళ్లోపడే ముందు వొకసారి క్రీగంట అతన్ని చూచాను. పెళ్ళి అలంకారాల్లో మనిషి దేదీప్యమానంగా వెలిగి పోతున్నాడు. కాని ఆ కళ్ళల్లో అదేమిటి....కోటేశ్వర్రావు కళ్ళల్లో కన్పించిన కోరికల వేడి లేదు! మంచు కళ్ళలా చల్లగా వున్నాయేం? నా శరీరం తగుల్తుందేమో నన్నట్లు దూరదూరంగా నిలబడ్డాడేం?

తలంబ్రాలప్పుడు. అప్పటికీ నేను చొరవచేసి అతని చేతిని తాకేను, మంచుముద్ద! వెన్నముద్ద! నాకేదో భయం వేసింది ఆక్షణంలో.



కాని పెళ్ళి తంతు ముగిసేక ఆయన పందిట్లో పది మంది మగా ళ్ళతో మాట్లాడు తున్నప్పుడు దొంగతనంగా చూచాను. ఎంత ఠీవిగా, దర్జాగా కూర్చున్నాడు? ఎంత ధాటీగా మాట్లాడుతున్నాడు? పాపం. తండ్రి ముందు చిలిపివేషాలెయ్యలేక పోయాడేమో. పదిమంది ముందు బరి తెగించి పెళ్ళాంతో పెళ్లి పందిట్లోనే సరసాలాడటం ఏం మర్యాద? వొంటరిగా కలిస్తే కదూ?

ఆ వొంటరితనం కోసం కళ్ళు కాయలు కాచేలా చూచాను. ఆ కొద్ది కాలంలో ఎన్నికలలు కన్నానో? ఎన్ని సంవత్సరాల అనుభవాల్ని వూహించుకొన్నానో? సినిమాలు చూచిన అనుభవం బాగా పనికి వచ్చింది.

ఆ రాత్రి....ఎన్నేళ్ళ నుంచో ఎదురు చూస్తున్న ఆ రాత్రి రానే వచ్చింది. యీ నల్లపిల్లకు తెల్లచీర కట్టబెట్టేరు. తెల్లటి విరజాజులు తలలో తురిమారు. ఒంటరిగా గదిలోకి నెట్టి తలుపులు మూసేరు.

సిగ్గు....సిగ్గు....సిగ్గు....।

సిగ్గుతో నా శరీరం మెలికలు తిరిగి పోతోంది. కోరికల్తో నా హృదయం దహించుకుపోతోంది.

అతను మంచం మీది నుంచి లేచొస్తాడు. నామీద చెయ్యి వేస్తాడు. నన్ను సున్నితంగా, సుకుమారంగా పొదివి పట్టుకుని నడిపించుకు పోతాడా? లేక సినిమాల్లోలా అమాంతం ఎత్తుకొని....

ఛీ....ఛీ....

(ఆ 'ఛీ ఛీ' లో ఎంత శృంగారం వుందో, కోరికుందో మరి।)

తలుపు దగ్గర తలవంచుకొని నిలబడ్డాను అలాగే।

## సూరయ్య :

ఎలాగైతేనేం? నా కోరికల్లో వొకటి నెరవేరింది. ఊరంతా పెళ్ళి కాదన్న కిష్టిగాడికి పెళ్లిచేశాను. వారసుడిని సంపాదించుకోవాలన్న లక్ష్యానికి దగ్గిరవుతున్నాను. ఆ రాత్రి....

ఆ రాత్రి అంటేనే భయపడ్తున్నాడు కిష్టిగాడు. యింత వరకు ఎలాగోలాగు రసాభాస కాకుండా వెధవ లాక్కొచ్చాడు. యీ రాత్రి రసాభాస చేస్తే?

యీ రాత్రి గడిచిపోతే కొడుకును, కోడల్ని ఏదో నెపంమీద వూరికి తీసుకుపోవచ్చు. కొడుకుని, కోడల్ని కారులో కూర్చోపెట్టి వూరే

గించవచ్చు. టపాకాయల, మతాబాల సంరంభం మధ్యన, బేండు మేళాల సందడితో 'నా కొడుక్కి పెళ్ళిచేసి కోడల్ని తీసుకొచ్చానహో' అని గర్వంగా వూరంతటికీ ఎరుక పర్చవచ్చు.




ఆ తర్వాత ఒకేచోట వుంటారు కనుక కల్సిపోతారు. నా రెండో కోరిక తీరుస్తారు. నా వంశం నిలుస్తుంది. వారసుడు పుడ్తాడు. ముసలితనంలో నాకు ఆడుకోటానికి తోడు చిక్కుతాడు.

ఇంతవరకూ అంతా అనుకొన్నట్లే జరిగింది. ఇక ముందు కూడా జరుగుతుంది. నాకు నా ప్రజ్ఞపై అమిత విశ్వాసం, నమ్మకం వుంది. ఎంత ఆత్మవిశ్వాసం లేకపోతే కౌలుదారుడుగా జీవితాన్ని ప్రారంభించి యీ రోజు మోతుబరి రైతు కాగలిగేను?

కామాక్షి :

నిల్చొని నిల్చొని కాళ్ళు నొప్పులు పుట్టేయి. సిగ్గు అలసిపోయింది. భయాందోళనలు భూతాల్లా మనసును చుట్టు ముట్టేయి.

ఆయన యింత సేపయినా రాడేం? నన్ను పలకరించడేం? నేనే ముందు పలకరించాలన్న పట్టుదలా? కట్నాలు కానుకలు అనుకొన్నట్లు ముట్టనందుకు అలుకా?

తలెత్తేను. కళ్ళు పెద్దవి చేసి గదంతా చూచాను. సినిమాల్లో శోభనంగదిలా కాకపోయినా అందంగానే వుంది. చిన్న బల్లమీద వెలుగుతున్న అగరు వత్తులు కాలి కాలి తమ ఆయుష్షును తామే క్షీణింపచేసుకొంటున్నాయి. బల్లమీద పరచిన తెల్లటి గుడ్డపైన వాటి నుసి గుట్టలు గుట్టలుగా పడివుంది. పాలన్నీ అడుక్కుపోయి నీళ్ళపైకి తేలేయా అన్నట్లు గాజుగ్లాసులో పాలు నీళ్ళరంగులో కన్పిస్తున్నాయి. పరుపుమీద పరచిన తెల్లటి దుప్పటి మడత నలక్కుండా అలాగే పడివుంది.

యింతకీ ఆయ నేడి? సినిమాలో హీరోలా కిటికీలో నుంచి చందమామ వైపు చూస్తున్నాడా? ఊహూఁ. లేదే. కిటికీలో చంద్రుడు పొరపాటున తన వైపు చూచినందుకు చల్లగా పలకరించి అయిదు

నిమిషాలు చంపేడు.

దొడ్డి తలుపు తెరుచుకొని అదేదో సినిమాలోలా, పాటపాడటానికి ఆరుబయటకు పోలేదుకదా! పిల్లేదే. ఆ తలుపు మూయండని అమ్మ చెప్పటం నేను స్పష్టంగా విన్నాను.

చెడిపోయిన ఆడ కూతురిలా మనసులో భూతాలు చెడదిరుగుతున్నాయి. విలయ నాట్యం చేస్తున్నాయి.

నేను కోరుకొన్న రాత్రి యిదికాదు. నా కలలన్నీ పరుపు అడుగున పడి నలిగి పోతునట్లనిపించింది. నా కోరికలు నాలుగు మంచం కోళ్ళ కింద పడి పగిలిపోతున్నాయి.

అయినా ఆశ చావక-చంపుకోలేక దొడ్డి తలుపుమీద చెయ్యి వేశాను, బాగానే తెరుచుకొన్నాయి తలుపులు. కాని మనసు మాత్రం ఒక్క క్షణం మూగపోయింది!

"మీరా!" అన్నాను.

"అవునమ్మా. అబ్బాయికి ఆరోగ్యం బాగాలేదు. ఆ మాటచెప్తే యీ కార్యక్రమం వాయిదా పడుతుందని అందరికీ చెప్పలేదు. ఈ తలుపు తీసి నా గదిలోకి పంపించా. వాడు నా గదిలో హాయిగా నిద్రపోతున్నాడు. నువ్వూ హాయిగా నిద్రపో. తెల్లవారేక మనవూరు వెళ్లిపోదాం. సరేనా?"

నా మనసు, ఆలోచనలు,అన్నీ స్తంభించిపోయాయి. సకల చరాచర ప్రపంచం గిరగిరా నా కళ్ళముందు కరాళనృత్యం చేస్తోంది.

"నా కోడలు బుద్ధిమంతురాలు. నాకు తెలుసు. వెళ్ళి గుట్టుగా తలుపేసుకొని నిద్ర పోమ్మా."

అనుకోకుండానే నేను ఆయన ఆజ్ఞను శిరసావహించాను. లోపలికెళ్ళేను. తలుపేసుకొన్నాను. మంచం మీద పడుకొన్నాను. కాని నిద్ర మాత్రం పట్టలేదు.

నా కోరికలా, మలేరియా రోగిలా వణుకుతూ రాత్రంతా పరుపు మీద అటూ ఇటూ దొర్లుతూనే వున్నాను!

## సూరయ్య :

అనుకొన్నట్లే కొడుకును, కోడల్ని కారులో కూర్చోపెట్టి ఘనంగా వూరేగించాను. టపాకాయలు మోగాయి! మతాబాలు పైకి ఎగిరి పోయిడాం అని పేలి, సప్త వర్ణాల్లో ముత్యాలను రత్నాలను కెంపుల్ని కిందికి

రాగం తానం పల్లవి

వెదజిమ్మాయి. బేండు మేళాల బృందం వూరు వూరంతటినీ అదర గొట్టి వదిలి పెట్టింది.

కామాక్షి వెంట వచ్చిన సవతి తల్లి కూతురు అదృష్టానికి పైనే ఏడ్చేసింది. ఊళ్లో వాళ్ళు - యింటికి పట్టిన అదృష్టానికి వోర్చు కోలేక చెవులు కొరుక్కోసాగారు. నాక్కావల్సింది అదే. వెధవలు వంకాయల్లా కుమిలి కుమిలి మాడిపోవాలి. వాళ్ళ పొట్టలు, హృదయాలు అసూయతో పగిలి పోవాలి.

నిజం చెప్పొద్దూ-కొడుకూ కోడలూ అలా కారులో కూర్చుంటే - యీడూ జోడుగా ఎంత చూడ ముచ్చటగా వున్నారని! కాని కిష్టిగాడు తలవంచుకొని. వూళ్లో నేను తలవంచుకొనేలా చేసేడు. ఆ పిల్ల తలెత్తి అందరి వైపూ చూస్తూ నా తలగొట్టేస్తుందేం?

కామాక్షి:

అత్తగారింట్లో కాలు బెట్టి నెలరోజులయినా ఆయన నాతో యింత వరకూ మాట్లాడలేదు. నా వైపు చూడలేదు. నా చేతి అన్నం తినలేదు. రాత్రిళ్ళు పొలంలోనే పడక. మామగారు మాత్రం నన్ను కనిపెట్టుకొని వాకిట్లో పడుకొనే వాడు,

పొద్దున్నే పొలంనుంచి వచ్చి. ఇంటిక్కావల్సిన నీళ్లన్నీ చెరువు నుంచి కావడితో తీసుకొచ్చి పోస్తాడు. ఆయన్ని చూడటానికి అదొక్కటే సమయం. తలకి గుడ్డచుట్టి. చెయ్యివూపుకొంటూ కావడి భుజాన వేసు కొని పెద్ద పెద్ద అంగలేసుకొంటూ వస్తుంటే ఆయన ఎంత దర్జాగా వుంటాడని? ఒక్కో అంగ తీసి వేసేటప్పుడు పిక్కల్లో కండలు గట్టిపడి ఎంత అందంగా కన్పిస్తాయో? రెండు చేతుల్తో రెండు బుంగల్ని తీసి అమాంతం తొట్టిలో నీళ్ళు గుమ్మరిస్తున్నప్పుడు భుజకండరాలు ఎంత దృఢంగా, ఆకర్షణగా వుంటాయో? పచ్చని అతని మొహంలో పెరిగిన గడ్డం మీసాలు ఎంత కాంతివంతంగా వుంటాయని! గాలికి వంకుల వంకుల జుట్టు అటూ ఇటూ వూగుతుంటే మన్మధుడు గుర్తుకు రాక మానడు.

కాని తను ఎదురు పడ్తే చాలు. ఏనుగంత మనిషి ఎలుక పిల్లలా మారి పరుగెత్తి పారిపోతాడు. ఏం చెయ్యను? అతన్ని ఆ సమయంలో కళ్ళారా చూచుకొని సంతోషించటం అలవాటు చేసుకొన్నాను!

పెద్ద పండక్కి పుట్టింటికి వొంటరిగా వెళ్ళేను. నా మనసును ఎవరి ముందన్నా విప్పి చెప్పుకోవాలన్న కోరికను అణచుకోలేక పోయాను.

అన్నీ విన్న సవతితల్లి అన్న మాటల్ని నేను మర్చిపోలేను - 'వెధవ వేషాలు వెయ్యకు. బంగారం లాంటి కాపురంలో చిచ్చు పెట్టుకోకు. నీకేం లోటు? ఆ ముసలాడు కాస్తా రేపో మాపో గుటుక్కుమంటే ఆ ఐశ్వర్యానికి నువ్వే మహారాణివి. పుట్టింటి కొస్తే కొత్త మొగుడొస్తాడా? పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు.''

తిరిగి వస్తుంటే బస్సులో కోటీశ్వర్రావు కన్పించాడు. అతనే ముందు గుర్తు పట్టి పలకరించాడు.

"నీ పేరు కామాక్షి కదూ?"

నాకు మండింది. మరో వైపు సంతోషం.

"ఎక్కడి దాకా వెళ్తున్నావేంటి?"

"అత్తగారింటికి"

"అయితే పెళ్ళయిందన్న మాట!"

"ఏం? నువ్వు చేసుకోనంత మాత్రాన నాకు పెళ్ళికాదను కొన్నావా?" అందా మనిపించింది. కాని నోరు పెగల్లేదు.

"ఎవరు?"

చెప్పేను.

"అలాగా? నాకు తెలీదే, మా అత్తగారి వూరు కూడా అదే. ఎవ రేంటి?"

ఇక అతనితో మాట్లాడాలనిపించ లేదు. అతనే భార్య వివరాలు, అత్తగారి ఐశ్వర్యం చెప్ప సాగేడు. భార్య ఎర్రగానే వుంటుందిట. కాని నా అంత అందంగా వుండదట.

ఆర్టీసీ బస్సు భయంకరంగా శబ్దం చేస్తోంది. గతుకులరోడ్డులో నా మనస్సలా ఎగిరెగిరి పడ్తోంది. అతను నా అందాన్ని పొగిడే కొద్దీ నాకు మండుతోంది. నల్ల పిల్లనని నన్ను కాదన్న మొగాడు కదూ

యితను!

"పొరబాటు చేసేనని ఎప్పుడూ ఏడుస్తుంటాను. నువ్వే ఎప్పుడూ గుర్తు కొస్తుంటావనుకో"




"ఇక నన్నా మర్చిపోవటం మంచిది"


గట్టిగానే అన్నాను. అదేం చిత్రమో! ఆ క్షణంలో అతని ముందు నాకు పిగ్గెయ్యలేదు!

## సూరయ్య:

పెళ్ళయి సంవత్సరం నిండినా కిష్టిగాడిలో మార్పు రాలేదు. నేను చెప్పాల్సిన మాటలు చెప్తూనే వున్నాను.

యిదిలా వుండగా నా కాలికి మాయ దారి రోగం వచ్చి పడింది. చిన్న గుల్లగా లేచిన పుండు పెరిగి పెద్దదై ప్రాణాలు తీయసాగింది. బాధ పెరిగే కొద్దీ వారసుడు లేకుండానే చనిపోతానేమోనన్న భయం పెరగసాగింది.

ఉహుఁ అలా జరగటానికి వీల్లేదు. కొడుకు కోడల్ని కలిపే బంధం



బిడ్డ. వాళ్ళ కెలాగైనా సరే వో నలుసు పుట్టాలి. నా రెండో కోరిక నెర వేరాలి, నేను చనిపోవాలి. అంతే!

పట్నానికి బయల్దేర దీసేను యిద్దర్నీ.

కాలు పరీక్షించి డాక్టరు కేన్సరన్నాడు, కిష్టిగాడిని పరీక్షించి శరీర సంబంధమైన వ్యాధి లేదని యీ డాక్టరూ అన్నాడు. ఆ మాట కామాక్షి వింది.

ఎందుకైనా మంచిదని కామాక్షిని కూడా వో లేడీ డాక్టరుకు చూపించాను.

.... .... .... ....

## కామాక్షి:

"సిగ్గుపడి లాభం లేదమ్మాయ్, నీ సంసారం సుఖవంతం కావా లంటే సిగ్గును చంపుకోవాలి. నీ భర్త జబ్బుకు మందు నీ దగ్గరుంది. అది నీ చొరవ, నువ్వు అతడిని నవ్వించో కవ్వించో, భయ పెట్టో భంగ పడో నీ వైపుకు తిప్పుకోవాలి. ఒకసారి నీ కొంగుకు తగిలేడా యిక నిన్నొదిలి పోలేడు" డాక్టరు ఏవేవో చిట్కాలు నాకు బోధిస్తుంటే నాకు చిరాకేసింది. అసహ్యమేసింది, నా గతికి ఏడుపొచ్చింది.

పట్నంలో వో పెద్ద హోటల్లో వో పెద్ద గది అద్దెకు తీసుకున్నాడు మామగారు. ఆ రోజు నా భర్త వచ్చే వేళకి ఎక్కడికో వెళ్తున్నానని చెప్పి వెళ్ళేడు మామగారు. ఆయన భావం నాకు అర్థమయింది.

నాక్కూడా ఆ పూట ఎందుకో వుత్సాహంగా వుంది. డాక్టరమ్మ చెప్పిన మాటలే మాటి మాటికీ గుర్తుకొస్తున్నాయి.

స్నానం చేసేను. కొత్త బట్టలు కట్టుకొన్నాను. సింగారించుకుని మల్లెలు సిగలో తురుముకొన్నాను,

ఎదురుగా వున్న నిలుటద్దంలో నా ప్రతిబింబాన్ని చూచుకొని నేనే మురిసి పోయాను, నల్లగా వుంటేనేం? ఎంత అందంగా, ఆకర్షణగా వున్నానో, యీ అందం అడవి కాచిన వెన్నెల కావల్సిందేనా? పీల్లేదు.

తలుపు తట్టిన శబ్దం! అవును. ఆయన వచ్చాడు.

ఆ భావనే నన్ను మళ్ళీ సిగ్గుతో ముంచేసింది. కదలి వెళ్ళి తలుపు తీయటానికే ఎంతో అవస్థ పడాల్సి వచ్చింది.




తలుపు తీసి సిగ్గుతో తలుపు వెనక్కి తప్పుకొన్నాను. 'నాన్నా' అంటూ అతను లోపలి కెళ్ళేడు. ధైర్యాన్నంతా కూడ గట్టు కొని తలుపు మూసేసి తల వంచుకుని నిల్చున్నాను.

అతను భయంగా వెనక్కి తిరిగి నా వైపు చూశాడు. బాధతో భయంతో సిగ్గుతో మెలికలు తిరిగి పోతూ పారిపోవటానికి మార్గాలు చూస్తున్నాడు.

సిగ్గు నొక్క క్షణం చంపి జాకెట్టులో దాచేను.

"ఏమండీ" అంటూ వెళ్ళి అతని చేయి పట్టుకొన్నాను.

ఆ చేయి-ఆ స్పర్శ -పురుష స్పర్శలో యింత సుఖం వుందా? కొత్త అనుభవం! ఒక్క క్షణం నన్ను నేను మర్చిపోయాను:

తిరిగి చూస్తే ఏముంది? అతనక్కడ లేడు. హోటలు రూము తలుపులు బార్లా తెరిచి వున్నాయి.

కోపం-చిరాకు-బాధ....నన్ను మింగేశాయి. జుట్టు పీక్కొన్నాను. పూలచెండు తీసి నేల కేసి విసిరికొట్టేను.

"అయితే కామాక్షీ, నువ్వు చేసుకొంది కిష్టయ్య నన్నమాట!"

ఆ మాట, ఆ గొంతు కోటేశ్వర్రావుదని నాకు లీలగా తెల్సు.

కాని కిందబడ్డ పూలచెండును తీసుకొని నా వైపు నడిచి వస్తున్న అతను నాకు నా భర్తగా కన్పిస్తున్నాడు. అదే రంగు-అదే ఒడ్డూ పొడుగు.

"మనుష్యుల మీద కోపం పూలమీద చూపకూడదు కామాక్షీ! పూలు చాలా సుందరమైనవి. నీలాగే సుందర సుకుమారమైన పూలమీదనా నీ కోపం?"

నా భర్త నా తల్లో పూలు పెడ్తున్నాడు. నన్ను లాలిస్తున్నాడు. నా భుజాలు పట్టుకొన్నాడు. రెండు చేతులమధ్య నా శరీరాన్ని సున్నితంగా పొదివి పట్టుకొన్నాడు.

"ఇన్నాళ్ళ నిన్ను చూసి భయపడి పొరపాటు చేసేను కామాక్షీ! ఇవాళ నే నదృష్టవంతుడిని"

అప్పటి నా అదృష్టాన్ని ఎవరికి చెప్పుకోను! నా భర్త తన పొరపాటు తెల్సుకున్నాడు. నాకు దగ్గరయ్యాడు: నా శరీరంలో అణువణువూ పులకరించిపోయింది. మనసు పూల గుట్టలో పడుకొని మత్తుగా నిద్రపోతోంది.

కళ్ళముందు అందమైన చీకటి. కమ్మటి మాయ!

ఆ చీకట్లో నాభర్త, అతని ఆజానుబాహు రూపం. అందమైన మొహం. అతను అందిస్తున్న అనుభవం....

నా కళ్ళు మత్తుతో మూతపడిపోతున్నాయి. నేను ఎక్కడికో జారిపోతున్నాను!

## సూరయ్యా :

కాలుకు పురుగులు కూడా పట్టేయి. యివాళో రేపో అన్నట్లుంది నా పరిస్థితి. కానీ నా మనసు మాత్రం మొగ్గలు తొడిగింది. అందమైన పూలు పూసింది.

కోడలు పండంటి కొడుకును కన్నది. ఊళ్ళో అమ్మలక్కల మొహం మీద పిడిగుద్దు గుద్దినట్లయింది. భరించలేక ముక్కులమీద వేళ్లేసు కొన్నారు.

"అదృష్టవంతుడివిలే సూరయ్యా! తెలివైన కోడల్ని సంపాదించావు. చూస్తున్నాంగా- గుణవంతురాలు. మనవడు అచ్చం నీ కొడుకును తీసిపెట్టేడనుకో."

పిల్లాడిని చూడ వచ్చిన వాళ్ళంతా యిదేమాట. పాడిందే పాటగా పాడి పోతున్నారు.

నిజం. నా మనవడు అచ్చం నా కొడుకులాగే వున్నాడు. అదే ముక్కు. అదే నోరు. అదే జుట్టు. అవేకళ్ళు ..ఎంత అందంగావున్నాడు?

అయితే ఆ రోజు- పట్నంలో హోటల్లో....

తలుపు తెరుచుకొని బయటికి వెళ్లింది పెద్దరెడ్డి అల్లుడు కోటేశ్వరరావు కాదా? నా కొడుకేనా? యిప్పుడు మళ్లీ అనుమానం వస్తోంది.

కాని ఆ నాడు —

తడబడుతూ లోపలికెళ్ళేను. కామాక్షి కళ్ళు మూసుకుని పడుకొని వుంది. గదంతా చీకటి.

కళ్ళు తెరిచి నన్ను చూడగానే ఆత్రంగా అడిగింది- 'అయనేరీ?'




"ఎవరు?" అన్నాను మతిపోయి నేను.

"మీ అబ్బాయి"

"వాడిక్కడి కొచ్చాడా?"

"యిప్పటిదాకా నా దగ్గ రేగా వున్నారు!"

మతంటూ ఏదన్నా కాస్త మిగిలి వుంటే, ఆ కాస్తా కూడా ఆ క్షణంలో పోయింది. కోడలు మొహంలో అబద్ధాలు చెప్తున్న చిహ్నాలు మచ్చుక్కూడా కన్పించలేదు.

నేను చూసింది భ్రమా? లేక కామాక్షి భ్రమ పడ్తోందా?

సత్యమో, భ్రమో, ఆ నాటి ఆ విషయాన్ని మనసులో ఓ మూలకు కుక్కేసి వూరుకున్నాను. కాని యింటికొచ్చాక కోడలి ప్రవర్తనను కనిపెట్తూనే వున్నాను.

నిప్పులాంటి పిల్ల. పర పురుషుడిని కన్నెత్తి కూడా చూడదు. ఎప్పుడూ కిష్టిగాడినే భ్రమగా చూస్తుండేది!

"నీ భార్య నీళ్లోసు కుందిట్రా! నువ్వు తండ్రివి కాబోతున్నావు" కిష్టిగాడి మొహంలోకి పరిశీలనగా చూస్తూ, అన్నానోనాడు. అన్నానే కాని వాడేం అల్లరి చేస్తాడోనని మనసులో భయంగానే వుంది.

కానీ చిత్రం! ఎన్నడూ లేంది వాడి మొహంలో చిత్రమైన వెలుగు

## మలుపు దారి

కొండదారిలో ఒక కారు స్పీడుగా పోతోంది. ప్రతి మలుపు దగ్గరా ఒకపెద్ద ప్రమాదం నుంచి తప్పుకుంటూన్నట్లు వుంది కారులో కూర్చున్న శేఖర్ కి.

"రాజేష్! ప్రతి మలుపు దగ్గర నీ కారు డ్రైవింగ్ చూస్తుంటే గుండె దడదడ లాడుతోంది. కొంచెం నెమ్మదిగా డ్రైవ్ చెయ్య కూడదూ!"

"భయ పడటం మెందుకు శేఖర్! మలుపు దగ్గరకి కారు వచ్చే సరికి నాలాగే నువ్వూ గట్టిగా కళ్లు మూసుకో!" అన్నాడు రాజేష్.




వచ్చింది, వెంటనే భార్య దగ్గరకి పరుగెత్తేడు.

అదే మొదలు, వాడు భార్యకు కాస్త కాస్త దగ్గరవుతూ వచ్చాడు. అయినా నే నానాడు చూసింది మనసులో ఓ మూల తంతూనే వుంది.

అయితే యివాళ నా మనమడు అంతా నా కొడుకు పోలికే! ఆ పోలికలు అంత స్పష్టంగా కన్పిస్తున్నాక, ఆ నాటి విషయం మనసులో నుంచి మాయ మయింది, మనసంతా ఆనందంతో, గర్వంతో, తృప్తితో నిండిపోతోంది.

నా కొడుకు కాపురం నిల్చింది. నాకు వారసుడు పుట్టేడు, నేను బతికుంటే ఆడుకోటానికి తోడు దొరికింది. నా కోరికలు రెండూ నెరవేరేయి.

యిప్పుడు నా దిగు లొక్కటే. చావుకు దగ్గరవుతున్నానని, ఆ చావును జయించి మరి నాలుగు కాలాలపాటు బతకాలన్న కోరికైతే వుంది కాని, అది నెరవేరదు. అంత సమర్థత నాకు లేదని తెల్సు!

## కామాక్షి:

అప్పుడే కళ్ళు తెరచిన పసిగుడ్డును చూసుకొని నేనెంతగా మురిసిపోయానో! గర్వించానో! వాడు అచ్చు తండ్రిపోలికే. చూడవచ్చిన వాళ్ళూ అదే మాట!

“ఏమండీ. యిలా రండి” లోపలికి రావటానికి సందేహిస్తూ వాకిలి దగ్గరనిలబడ్డ ఆయన్ని ప్రేమగా పిల్చేను. పిలవటమే ఆలస్యం పరుగెత్తు కొచ్చాడు ఆయన.

కొడుకు పుట్టబోతున్నాడన్న వార్త తెల్సిందగ్గర్నుంచి ఆయన మారిపోయాడు, వెనుకటిలా నన్ను చూడటానికి, మాట్లాడటానికి భయ పడటం లేదు. సిగ్గుపోయింది. నాకూ ఆయన్ని తలుచుకోగానే సిగ్గు ముంచుకు రావటం లేదు.

“మీ కొడుకు” అన్నానే కాని, నా మాటల్లో ఎక్కడో నాకే ఏదో అపశ్రుతి వినిపించింది. ఏదో అనుమానం! భయం!




ఆయన కొడుకును చేతుల్లోకి తీసుకొన్నాడు. ప్రేమగా చూశాడు. మృదువుగా బుగ్గల్ని ముద్దాడేడు.

"నువ్వెంత మంచి దానివి కామాక్షీ!"

నా కళ్లలోకే చూస్తూ ఆయన అమాట అంటుంటే నాకు మళ్లీ సిగ్గు ముంచుకొచ్చింది. శృతి సరిఅయింది.

"మీరు మాత్రం? మీలాంటి గొప్పవ్యక్తి నాకు భర్త కావటం నా అదృష్టం కాదూ?"

కృతజ్ఞతాభావంతో నా మనసు ఆర్ద్రమయింది. అమాంతం ఆయన చేతుల్లో వాలిపోయి కరిగిపోవాలనిపించింది. కాని ఎలా?

"అబ్బాయికి ఏం పేరు పెడదాం."

"ఏమో! మీ కొడుకు! మీ ఇష్టమొచ్చిన పేరుపెట్టండి."

"అలా కాదు. కష్టపడి కన్నది నువ్వు. నువ్వే చెప్పాలి."

"ప్రద్యుమ్నుడు"

"ఆయనెవరు? మీ తాతా?"

"మన్మథుడికి మరోపేరు ప్రద్యుమ్నుడు. శ్రీకృష్ణ భగవానుడి కొడుకు."

"అయితే?"

"నా భగవంతుడు మీరు. మీ కొడుకుపేరూ అదే. నా ప్రేమ పంట వీడు. మన మధ్య ప్రేమను నాటిన ప్రద్యుమ్నుడు వీడు. మన్మథుడు."

"కామాక్షీ!"

బాలింతననైనా ఆలోచించకుండా ఆయన అమాంతం తన దృఢమైన చేతుల్తో నన్ను పొదివి పట్టుకొన్నాడు. హృదయానికి దగ్గరగా హత్తుకొన్నాడు.

"ఛీ. ఈయనకు మరీ యింత సిగ్గులేదేం?"

అప్పటి నా అందాన్ని, గర్వాన్ని వర్ణించటానికి నా దగ్గర మాటల్లేవు. నేను అంతగా చదువుకొన్న దాన్ని కాదు. క్షమించండి! *